

# రామరాజ్యంలో

కేయాస్ దిబ్బకు ఎట్లా చేరాడన్నది స్పష్టం కావటంలేదు. అతను "బంగాళాదేశానికి" బయలుదేరిన మాట నిజం.

"భద్రం, బంగాళాదేశానికి నీకు దారి తెలుసా?" అని కేయాస్ అడిగాడు.

"దేనికి, గురూ?" అన్నాడు భద్రం.

"మనం అక్కడికి వెళ్లాలి. ఈ యాహ్యాఖాను అంతకుడేమోనని నా అనుమానం".

"అందుకు సందేహమేమిటి, గురూ? ఆడు పెద్ద కేడీ కాకపోతే ప్రెపంచ నాయకులంతా ఆడికి అంతయినయం చూపేరు!" అన్నాడు భద్రం.

"అందుకే మనం బంగాళా వెళ్లాలి".

"యహ్యాఖానక్కడుండడుగదా. మనం పాకిస్తాన్ వెళ్లాలి మరి".

"అత్యాకాండ జరుగుతున్నది బంగాళాలోగదా, భద్రం? డిటెక్టివ్ అయిన వాడు అత్యజరిగేచోటికెళ్లి, కులూలు దొరికినవన్నీ సంపాయించి, వాటి సహాయంతో అంతకుణ్ణి చేరుకోవాలి. నీవు డిటెక్టివ్ మూలిక సూత్రాలే మరిచావు."

"అది నిజమే అనుకో, గురూ. కాని—యెక్కడి బంగాళా, యెక్కడ మనం! మనం అక్కడికి మజిలీలమీద చేరేసరికి వాళ్లు యయ్యాఖాన్ని బెండు మేళాలతో ఊరేగిస్తూ ఉంటారేమో! ఈ రాజకీయ హత్యలమాట చెప్పటానికి లేదు. గురూ! రాజకీయాల్లో రెండే పద్ధతులు—హత్యలుచేసి కోటలో పాగా వెయ్యాల, లేదా, కోటలో పాగావేసి హత్యలు చెయ్యాల. మూడోమార్గం సరవోదయం. అంటే రాజకీయాలకు టా టా జెప్పి తాపసు చెయ్యటం. అంచేత. నేను చెప్పేదేవిటంటే, మనం ఇక్కడే ఉండి మన పనులు చూసుకోవటం మంచిది."

"భద్రం, నీవు ఎగస్ట్రా వేషాల కోసం ఈ మాటంటున్నావు. విన్న ఆంధ్రదేశమంతటా బ్రహ్మాండంగా విడుదలైన పిల్లి తుపాకీ పిక్చర్లు దెబ్బ తగలకుండానే పడిపోయిన ఎగస్ట్రా నువ్వు కాదా? నేను పోల్చుకోలేననుకున్నావా?"

"అబ్బా! క్లూ దొరికిందన్నమాట! గురూ, ఆ తప్పంతా ఎడిటరు నాకొడుకుది. మిడ్‌షాటు ఓవర్‌కట్ చేశాడు. దెబ్బ తగలకపోవడమేంటి? గుండె అదిరిపోతేను! హీరో నాయాల కొట్టాలా. చెయి తాకితే చాలా అనడిగాడు. కొట్టుడే నన్నాడు డైరెక్టరు నాకొడుకు—".

"భద్రం, నువ్వు దిక్కుమాలిన సినిమా ప్రెవేశంలో పడకు. నీబోటి వాళ్ల మూలానే డిటెక్టివ్‌లు పడిపోయి డాండాం పిచ్చర్లు లేచిపోయినై. మనం బంగాళాకు వెళ్లి తీరాలి. నీకు దారి తెలుసా అనడుగుతున్నా".

భద్రం చిన్నబుచ్చుకుని, "దాందే వుందిలే, గురూ? దారే తెలీక పోతుందా?" అన్నాడు.

కొడవటిగంటి కుటుంబరావు

తరవాత యిద్దరూ బయలుదేరారు. నడిచారు. లారీలమీద వెళ్లారు. గడ్డిబళ్ల మీద వెళ్లారు. కొంతదూరం రైల్లోకూడా వెళ్లారు, కాని మధ్యలో టీ టీ యీ లు వాళ్లని దించేశారు. ఆతరవాత మళ్లీ నడిచారు. నడుస్తుండగా దారిలో ఒక మొండికెత్తిన కారు కనిపించింది. కారులో ఇద్దరు ఆడవాళ్లు, ఒకడె డ్రైవరు. భద్రం బానెట్ పైకెత్తి క్షణంలో లూజ్ కాంటాక్టు సరిచేశాడు. కారు కదిలింది. కారులోవాళ్లు కీయాస్‌నూ, భద్రాన్ని, "ఎక్కడికెలుతున్నారు?" అని అడిగారు.

"బంగాళా," అని కీయాస్ గట్టిగా చెప్పాడు.

స్త్రీలు వాళ్లను కారులో ఒకచోట దించి, ఎడంపక్కగా వెళ్లే రోడ్డు చూపించి, "అరమైలు దూరంలో ఉన్నది బంగాళా," అన్నారు.

కారు వెళ్లి పోయింది. ఆడవాళ్లు చూపిన రోడ్డు మొగవాల్లో ఒక బోర్డు మీద "రామరాజ్యానికి దయచెయ్యండి. స్వాగతం" అని ఉన్నది.

ఆ రోడ్డుమీద కొద్ది దూరం నడిచి వాళ్లు దిబ్బ చేరుకున్నారు. అక్కడ ఒక రహదారి బంగాళా ఉన్న మాట అబద్ధంకాదు.

## 2

రహదారి బంగాళా ముందు ఒక జీపూ, ఒక కారూ ఉన్నాయి. కారుదగ్గిర ఎవరూ లేరు. దానిమీద "సంచార న్యాయస్థానం" అని రాసిఉంది. జీపు పక్కన ఒకడు కాలీ బంట్రోతున్నాడు.

భద్రం తన జేబులోంచి రెండు బీడీలు తీసి ఒకటి బంట్రోతుకిస్తూ, "అన్నా, బంగాళాలో ఎవరో ఆఫీసర్లు దిగినట్లున్నారే?" అన్నాడు.

బంట్రోతు అగ్గిపెట్టె తీసి, పుల్ల వెలిగించి, తన బీడీ కాల్చుకొని, భద్రం బీడీ అంటిస్తూ, "మొబైల్ కోర్ట్", అన్నాడు క్లుప్తంగా.

"అనగా ఏమిటో కాస్త యిశదంగా చెప్పన్నా," అన్నాడు భద్రం.

"దిబ్బకు ఒక పెద్ద కోర్టూ, ఒక చిన్న కోర్టూ ఉన్నాయి. రెండూ వీలుగా ఉంటుందని, ఒకదానిపక్కన మరొకటి కట్టారు. ఎవరికి వీలని అడగవేం? పట్నంలోవాళ్ళకి. మరి దేశంలో జరిగే అన్యాయాలన్నీ అక్కడికే రావాలి. కాని రావటంలేదు. జనం ఆందోళన చేశారు. అంచేత మహారాజాగారు ప్రజల సౌకర్యంకోసం సంచార న్యాయస్థానాలు పెట్టారు. ఎంతకీ? పెట్టి అయిదారునెల్లే అయింది. వారం విడిచి వారం ఈ కార్లలో న్యాయమూర్తులు గ్రామాలన్నీ సంచారించి, కేసులు విచారించి, రికార్డులు రాసుకుని, తీర్పులు చెప్పి వస్తూంటారు.

"అందుకే గాంవాలు దీన్ని రాంవ రాజ్యమన్నారు!" అన్నాడు భద్రం.

"అదీమన్నా, మా మహారాజావారికి గల పదహారు పేర్లలోనూ రామ అనే పదం ఒకటి ఉన్నది." అన్నాడు డావాలీ బంట్రోతు.

అతగాడి మాటలు వింటూంటే భద్రానికి ఆశ్చర్యం వేసింది.

"అన్నా, నువు బాగా చదువుకున్నట్లున్నావే?" అన్నాడాతను.

"విద్వాన్ పరీక్ష పాసయాను," అన్నాడు దవాలీ బంట్రోతు.

భద్రం ఏదో అనబోయి నోరు తెరిచి మళ్లీ మూసుకున్నాడు.

"ఆశ్చర్యపడకు. నాకున్న తర్కమీమాంసాలు హెచ్చుగా చదువుకున్న నా పింతల్లి కొడుకు, శవాలు మోసి బతుకుతున్నాడు. నా పని బాగానే ఉన్నది. ఒక వారం చుట్టు తిరిగి వచ్చామంటే మాకు షడ్రసోపేతంగా భోజనాలూ, ఇతర సదుపాయాలూ జరుగుబాటు కావటమే గాక, మరో వారానికి సరిపడా గ్రాసం లభిస్తుంది. ప్రతి గ్రామాధికారీ మాకందరికీ మామూళ్లు ఇస్తాడు," అన్నాడు దవాలీ బంట్రోతు.

"మీ పింతల్లి కొడుక్కు ఎట్లా జరుగుతున్నది, బాబుగారూ?" అన్నాడు భద్రం మరింత మర్యాదగా.

"వాడి పని బాగానే ఉంది. ఈ దేశంలో రోజా హత్యలు జరుగుతూంటాయి. శవాల మోత తియ్యకుండా ఉంటుంది. వాడికి పోలీసు అధికార్ల అనుగ్రహం ఉన్నది. శవాలను రుద్ర భూమికి చేర్చటానికి మావాణ్ణి పోలీసులు తరచుగా నియోగిస్తూ ఉంటారు. తడవకు నాలుగు రూపాయలు. కేసులూ గట్రా జరిగినప్పుడు కోర్టు సాక్ష్యమూ మామూళ్లూ ఉంటాయి: హత్యానేరం ఎవరిమీదనన్నా ఉన్నప్పుడు మావాడు వెళ్లి ముద్దాయికి అనుకూలంగా ఉండేటట్లు శవం గురించి సాక్ష్యం ఇస్తాడు. ముద్దాయి తాహతను బట్టి మా వాడికి మామూలు ముట్టుతూ ఉంటుంది. ఇటీవల వాడు పెద్ద లోగిలి కట్టించుకుని, అందులో కూతురికి బ్రహ్మాండంగా పెళ్లి చేశాడు".

"పోనీ, పాపం! అదే కావలిసింది. సినిమాల్లో ఎక్స్ట్రా వేషాలేసి ఎప్పటికి ఇల్లు కట్టేటట్టు?" అన్నాడు భద్రం.

"ఏమిటదీ?" అన్నాడు దవాలీ బంట్రోతు,

"ఏదో, సొంత గొడవ లెండి!" అన్నాడు భద్రం.

ఆఫీసర్లు —అంటే న్యాయమూర్తులు —బంగాళాలోనుంచి తూలుతూ బయటకొచ్చారు.

"మందు కొట్టేశారు గురూ!" అన్నాడు భద్రం రహస్యంగా.

న్యాయమూర్తులు అతి కష్టంమీద కారులోకీ, జీపులోకీ ఎక్కారు. ఒకడు మాత్రం రోడ్డుమీదనే పడుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాడు.

"వారు జీపు డ్రైవరుగారు!" అన్నాడు దవాలీ బంట్రోతు భద్రంతో చిన్నగా.

"అంత పారవశ్యంలో వారు జీపు ఎలా డ్రయివు చేస్తారన్నా?" అన్నాడు భద్రం.

"జీపు నడవదు!" అంటుండగా కారులోవాళ్లు దవాలీ బంట్రోతును పిలిచారు.

అతను వెళ్లి మాట్లాడి వచ్చి, "మరొక డ్రైవర్ని తెమ్మంటున్నారు. వెళ్ళక తప్పదు." అన్నాడు.

"జీపు నడపటమే అయితే నేను నడపగలను. కారు ముందు పోతే వెనగ్గా జీపు తోల్తాను," అన్నాడు భద్రం.

"నిజమా!" అని ఆశ్చర్య పడుతూ బంట్రోతు కారులో వాళ్ళకీ మాట చెప్పాడు.

"రమ్మను, రమ్మను! ఇప్పటికే ఆలస్యమయింది," అన్నారు కారులో ఉన్నవాళ్లు.

"ఏం గురూ? ట్రిపెళ్లొస్తాను. ఈ లోపల నువు ఊరు చూస్తూ ఉండు." అంటూ భద్రం జీపులో ఎక్కాడు. కార్లు కదిలాయి.

## 3

కార్లు కను చూపు మేర దాటక మునుపే నగరంవైపు నుంచి ఒక మనిషి పరిగెత్తుకుంటూ వచ్చి, బ్రేక్ వేసినట్టు ఆగిపోయి, "అనుకున్నంతా అయింది. కార్లు అరగంట ముందుగా బయలు దేరాయి," అని కేయాస్ కేసి తిరిగి, "మీరెవరు?" అన్నాడు.

"నన్ను డిటెక్టివ్ కేయాస్ అంటారు. నేనూ, భద్రం ఈ పూటే వచ్చాం—"

"డిటెక్టివంటే నేరస్థులను పట్టుకునే వాడేనా?" అన్నాడా మనిషి.

"అవును!" అన్నాడు కేయాస్ రొమ్ము విరిచి.

"ఆ మాట ఇంకెవరితోనూ అనకు. ఈదేశంలో అలాటి వాళ్ళను బొక్కలోకి తోస్తారు. నేరస్థులనగా ఎవరు? అంతా గొప్పవాళ్లే కాదుటయ్యా? ఈ నగరంలో పెద్ద పెద్ద ఇళ్లున్న వాళ్ళందరి మీదా బోలెడంత ఫైలుంది. కొందరి మీద కేసులు నడుస్తున్నాయి. వాళ్లు అధికారాలు చలాయిస్తూనేఉన్నారు. అవ్ కోర్స్, నేరస్థులలో దుక్కవాళ్ళతోబాటు బక్కవాళ్ళూ ఉన్నారు. బక్కవాళ్ళను పోలీసులు కనిపెట్టి ఉంటారు, పోలీసుల్ని దుక్కవాళ్లు కనిపెట్టి ఉంటారు. గడిచిన పదేళ్ళలో కొత్త జైళ్లు కట్టటానికి పది లక్షలు ఖర్చు పెట్టాం."




"మీరే?" అన్నాడు కేయాస్ ఆశ్చర్యంగా. ఆ మనిషి పది వేలైనా చేసేటట్టు లేదు చూస్తే,

"నేనంటే నేనా? ప్రభుత్వం తరపున మాట్లాడుతున్నా."

"నేను రామ రాజ్యం విలేఖరిని. రెండేళ్ళ క్రితం దాకా కాలేజీ ప్రిన్సిపాల్గా ఉండేవాణ్ణి. చదువు కున్నవాళ్లు జాస్తి అయిన కొద్దీ విద్యాధికులలో నిరుద్యోగం జాస్తి అవుతున్నదని కాలేజీ మూసేశారు. మెడికల్ కాలేజీ, ఇంజనీరింగు కాలేజీ ఆ క్రితం ఏడు మూసేశారు. ఎందుకూ? ఈ దేశంలో ఇంజనీర్లనవసరం. డాక్టర్లేమో పది మంది ఉండనే ఉన్నారు. అందులో అయిదుగురు ప్రాక్టీసు లేక మందుల షాపులు పెట్టుకున్నారు. దేశావసరాలు చూసి సంస్థలు ఏర్పాటు చేసుకోవాలి. ఏమంటావు?" అన్నాడు మాజీ ప్రిన్సిపాలు.

"అంతే లెండి. భద్రం సిస్టరు కొనాలంటాడు. మనకెందు కంటాను."

"ఏం కొనాలంటాడూ?"

"అదేనండీ, రెవిడియో! కుర్రనాయళ్లు సైకిళ్ళమీద పోతూ పాడించుకుంటూ పోరూ?"

"ట్రాన్సిస్టరా?...... అన్నట్టు భద్రం, భద్రం అంటావు. ఏడీ ఆ భద్రం?"

ఆ జీపు తోలే ఆయన ధాసెక్కువై రోడ్డు మీద పడుకుంటే, ఆ జీపు తోలి రమ్మని నేనే పంపా! వాడి కోసమే చూస్తున్నా."

"అతగాడు అప్పుడే ఎక్కడొస్తాడు? వారం పట్టుతుంది. కాస్సేపు ఈ బంగళాలో కూర్చుని మాట్లాడుకుందాం. పత్రిక్కి ఏదో గాలి పోగు చెయ్యాలిగా!" అంటూ ప్రిన్సిపాలు జర్నలిస్టు బంగళా మెట్లెక్కాడు. కేయాస్ అతన్ని అనుసరించాడు. భద్రం వారందాకా రాడా? ఈ రామ రాజ్యంలో భద్రం తోడు లేకుండా వారం రోజులు ఎలా గడపడం అనుకున్నాడు కేయాస్.

ఇద్దరూ లోపలకెళ్ళి కుర్చీలలో కూర్చున్నారు. పత్రికవాడు చేతిలో చుట్టగా ఉన్న పేపరు విప్పి ఒక్కొక్క పేజీ పై నుంచి కిందికీ, పక్క నుంచి పక్కకూ చూడసాగాడు.

"ఏమిటి విశేషాలు?" అని కేయాస్ నిశ్శబ్దం భరించలేక అడిగాడు.

"రావణుడు చేసిన పొరపాటు! విభీషణుడు సజ్జనుడు!" అంటూ జర్నలిస్టు చదివి మళ్ళీ మానేశాడు. మరో నిమిషం తరవాత అతను పేపరు మీద

గట్టిగా కొట్టి, కేయాస్‌కేసి తిరిగి, "ఈ కుంట రోజూ మా పత్రిక్కి సంపాదక లేఖలు రాస్తారు. సంచార న్యాయస్థానాలు రద్ద దండుగట! వాళ్లు ఈ నాలుగైదు నెలలలో ఒక్క కేసు కూడా రికార్డు చెయ్య లేదుట. ఒక్క కేసు కూడా రికార్డు కాలేదంటే నేరాలు జరగడం ఆగి పోయిందనే గదా! అంతకన్న ఇంకేం కావాలి? నేరాలు జరగకుండా ఉండడానికి ఎన్ని లక్షలయినా ఖర్చు చేయొచ్చునే! రామరాజ్యం అమలు జరగటానికి సంచార న్యాయస్థానాలే కారణం అయితే వాటిని పెంచాలి గాని మానిపించమని ఎవడన్నా వెర్రిగ్గా అంటాడా? ఇలాటి వాళ్ళని చీల్చి చెండాడాలి'' అన్నాడు జర్నలిస్టు ఉద్రేకంగా.

"రోజూ అత్యాచారాలు జరుగుతాయిట కదండీ?'' అన్నాడు కేయాస్.

జర్నలిస్టు ఉలిక్కిపడి, ''ఎవడా అన్నది?'' అన్నాడు.

"ఆయన గారిపేరు తెలీదండీ! అదేదో ఆధ్యాన్న పరీక్ష పాసయినానన్నాడు" అన్నాడు కేయాస్.

"ఇలాటి మాటలు నమ్మొద్దు. రాజద్రోహాలు అనేకం కల్పించి చెబుతారు. ఎక్కడయినా హత్యలు జరిగినట్టు తెలిసినా వెళ్ళి డిటెక్షనూ, అదీ చెయ్యొద్దు. పీకలమీదికొస్తుంది!... అన్నట్టు నాకు మైమైపోయింది. ఇవాళ జీపులోనూ, కార్లోనూ వెళ్ళినవాళ్ళ వివరాలు తెలిస్తే చెప్పు నేను పత్రిక్కి రిపోర్టివ్వాలి!'' అంటూ జర్నలిస్టు నోటుబుక్కూ, పెన్నులూ పైకి తీశాడు.

"వాళ్ళెవరో నాకు తెలీదండీ! అందరూ మంచి గిరమీద ఉన్నారు. అంతకుమించి నాకేమీ తెలీదు!'' అన్నాడు. కేయాస్.

జర్నలిస్టు కోరికమీద అతను వెళ్ళిన వాళ్లను తనకు చాతయినట్టు వర్ణించాడు. వాళ్ళెవరై ఉంటారో జర్నలిస్టు ఊహించి రాసుకున్నాడు.

## 4

కేయాస్ ఊరు తిరుగుదామని చూశాడు. కాని అతనికి బంగాళాదాటి ఆటే దూరం వెళ్ళటానికి సంకోచం కలిగింది. అతను ఒక బంగాళాకు పోదామని బయలుదేరి ఇంకో బంగాళా చేరుకున్నాడు. ఇది కూడ చెయిజారిపోతే తనకు తానెవర యిందీ, ఎక్కడున్నదీ కూడా తెలియకుండా పోయేలాగున్నది.

'భద్రం ఉంటే ఇంతబాధ లేకపోవును'..

దగ్గర్లో ఓ కాఫీ హోటలుంటే ఇంతతిని బంగాళాకు తిరిగివచ్చి, గచ్చుమీద పడుకుని అట్లాగే నిద్రపోయాడు కేయాస్.

"గురూ! అసలు సందేశ ఈ నిద్దరేంటి?' అని భద్రం అంటున్నట్టు కల వచ్చి కేయాస్ నిద్రలేచి. అది కలలాదని తెలుసుకున్నాడు.

'అప్పుడే వారం అయిపోయిందా! భద్రం? అబ్బా చాలా నిద్రపోయానన్న మాటా!' అన్నాడు కేయాస్.

'వారం కావటమేమిటి? ఇంకా చీకటి కూడా పడందే! జీపుతోపే ఆయనకు మైకం వదిలింది. నన్ను ఎదురొచ్చే లారీలో పంపేశారు. పదిరూయపాల్నోటు జేబులో పెట్టారు. కోడి మాంసంతో మాంచి భోజనం పెట్టించారు. చెప్పొద్దూ గురూ! ఆళ్ళను వదిలిరావటం అంటే పేనం ఒప్పలా. దబ్బేంటి? ఆళ్ళకు మంచినీళ్ళతో సమానం. నిజంగా ఇది రామరాజ్జెమే గురూ! అళ్ళెవళ్ళకీ జీతాల్లేవు తెలుసా? జీతాలెందుకూ? ఓటళ్ళవాళ్ళు విందుభోజనాలు పెడతారు. సారాదుకాణాల వాళ్ళు సారాకాయలిస్తారు. రాత్రిమజిలీ చేసే చోట అమ్మాయిలొచ్చి ఆటా, పాటా, అన్నీ చూపిస్తారంట! బతికితే అట్టా బతకాలి! వాళ్ళకే కాదు సర్కారు ఉద్యోగస్తులెవరికీ జీతాలుండవట. ఇంక సమ్మెలుండవన్న మాటేగా! జీతాలు పెంచాలనేగా సమ్మెలు చేసేదీ? మీ బతుకు మీరు బతక్కోవటానికి సర్కారుద్దోగుల్ని దేశంమీద యిడిచిపెడతారంట. ఆళ్ళ శక్తి కొద్దీ ఆళ్ళు బతుకుతారు. ఈ ఆరణ్యామెంటు నాకు బాగా వచ్చింది. గురూ! ఇట్టాటిది మనదేశంలో కూడా ఉంటే నాసామిరంగా మన తడాకా చూపిద్దుం! ఏంటి?... ఇక్కడ మటుకు మన తడాకా చూపియ లేమనా? మేం భోంచేసిన హోటలు సర్వరు గాడు నన్ను గురించి తెగ ఆరాలు తీశాడు. దాపరికం దేనికి? మా గురూ గారు పేరుమోసిన డిటెక్టివు. నేను అసిస్టెంటునని చెప్పేశా! ఇక్కడికేల వచ్చా రన్నాడు. హత్యలు అవీ జరిగితే ఛణంలో హంతకుల్ని పట్టేస్తామన్నా. మీ గురువు గారు ఎక్కడని అడిగాడు. బంగాళాలో ఉంటాడన్నా. అదే మంచి చోటు అక్కణ్ణుంచి కదలొద్దన్నాడు. అమాటేదే చెప్పాలా ఏం అన్నా—''

భద్రం ఇంకా ఏం చెప్పే వాడోగాని ఇంతలో బంగాళాముందు ఒక జీపు వచ్చి ఆగింది. అందులోనుండి ఇద్దరు పోలీసులు దిగి లోపలికి వచ్చి, ఇద్దరినీ జీపులో ఎక్కించుకుని తీసుకు పోయి, ఏవో అడిగి రాసుకుని, ఆ రాత్రికి జైల్లో ఉంచారు.

మర్నాడు ఉదయం వాళ్ళిద్దర్నీ ఇంకో అధికారి ఇంటర్వ్యూ చేశాడు.

''నువేనా డిటెక్టివని చెప్పుకు తిరుగుతున్నది? ఎంతమంది నేరస్థులను పట్టావింతవరకు'' అన్నాడాయన.

"ఏదీ? ఇతర డిటెక్టివ్‌ల పోటీ జాస్తి అయిపోయింది. ఒకరిద్దరు అంతకుల్ని పట్టుకోవలసిన వాణ్ణే, కాని నేను పట్టుకునే లోపల ఇంకెవరో పట్టేశారు. ఒకసారి రాకెట్‌లో ఒక అంతకుణ్ణి తరిమాం! కాదు, భద్రం? వాడూ దొరకలేదు''.

ఇలా కేయాస్ చాలాసేపు మాట్లాడినాక పోలీసు అధికారి, "తిండి దండగ! ఈ పిచ్చాళ్ళని పొలిమేర దాటించి పంపెయ్యండి?'' అన్నాడు.

ఇద్దరినీ పోలీసులు మళ్లీ జీపులో ఎక్కించి దిబ్బ సరిహద్దు దగ్గర దింపి, "పొండి!'' అన్నారు.

అక్కడో పలకమీద భద్రం ఇలా చదివాడు:

''మీ రాకకు మా దేశం ఎంతో ఆనందిస్తున్నది. క్షేమంగా వెళ్లిరండి.''

* * *